



# మనిషి మేల్కొన్నాడు

**- విశ్వనాథ రమ**

ప్రతీ రోజూ ఇదే తంతు. దేవుడికి పూలివ్వండి, అన్నదానాలు చేస్తాం, చందాలివ్వండి.

"కష్టపడి పూల మొక్కలు వేసింది మీ అందరికీ పంచడానికా!

డబ్బు కూడబెట్టినది మీలాంటి సోమరిపోతుల చేతుల్లో పోయడానికా! వెళ్ళండి. వెళ్ళండి!" గట్టిగా కసిరాడు రామచంద్రం.

అతనికెదురుగా నిల్చున్న మురళి, వినయ్‌లు మొహమొహాలు చూసుకున్నారు. మారుమాట్లాడకుండా చిరునవ్వుతో అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

వాళ్ళు వెళ్ళడం గమనించాడు రామచంద్రం. చేతికున్న ఉంగరాలని, కట్టుకొన్న తెల్లటి పొందూరు పంచెని తృప్తిగా చూసుకొని తనలోతాను నవ్వుకున్నాడు.

వాళ్ళకి బాగా బుద్ధిచెప్పాననే భావం ఆ నవ్వులో గోచరించింది.

ఈనాటి యువతకి కష్టపడటమంటే చికాకు. ఈజీగా డబ్బు సంపాదించాలి. జల్సా చేయాలి.

దేవుడు పేరుచెప్పి చందాలు వసూలుచేస్తారు. ఆ డబ్బుతో హోటళ్ళకి, సినిమాలకి వెళ్తారు. ఏం మనుషులో! ఎప్పుడు మారతారో!

అనుకొంటూ వసారాలో కూర్చున్న రామచంద్రం దిగ్గున లేచాడు. టైమ్ చూసాడు. ఎనిమిది దాటింది.

ఉదయం ఆరు గంటలకే తన ముందు ప్రత్యక్షమయ్యే సన్యాసిగాడింకా టిఫిన్ తేలేదేంటి చెప్మా అనుకొంటూ...

ఇంట్లోకి నడిచి ఇల్లల్లా కలయతిరగడం మొదలెట్టాడు.

పెద్ద పెద్ద వసారాలతో... చుట్టూ గదులతో ఊరి మొత్తంమీద తనిల్లే అందంగా, చూపరులకు ప్రత్యేకంగా కనిపిస్తుంది.

ఎన్నో రకాల వ్యాపారాలు చేసి, రాత్రిపగలు తేడా లేకుండా కష్టపడి పెద్ద స్థలం కొన్నాడు. తర్వాత ఇల్లు కట్టాడు.

భార్య సుభద్రకి ఒంటి నిండా బంగారం పెట్టాడు. కొడుకు అభిరామ్‌ని డాక్టర్‌ని చేసాడు. తన కలల్ని నిజం చేసాడు.

ఇంక తనకేలోటు లేదనుకున్న తరుణంలోనే దురదృష్టవశాత్తు భార్య గతించింది. తను ఒంటరి వాడయ్యాడు.

కొడుకు హైద్రాబాద్‌లో సెటిల్ అయ్యాడు. అప్పుడప్పుడు ఫోన్లు చేస్తూంటాడు. మనుషులు దూరమైనా... అనుబంధాలు తెగిపోవు.

తన ఆలోచనలన్నీ అభిరామ్ చుట్టూ తిరుగుతాయి.

కొడుకు దూరమైనా ఒంటరిగా ఉంటున్నాననే బాధ, బెరుకు, బెంగ ఏనాడు తనని బాధించలేదు. లంకంత ఇంట్లో హాయిగా తిరుగుతూ.

హోటల్‌నుండి కేరేజీలు తెప్పించుకొంటూ బ్రతుకు బండి కొనసాగిస్తున్నాడు.

ఉన్న ఊళ్ళో ఉన్నాననే తృప్తి... ఆస్థిపాస్తులు దగ్గరుండి చూసుకోగలననే ధీమా తననింతవరకు కొడుకు దగ్గరికి వెళ్ళనీయకుండా చేసాయి.

ఇల్లల్లా కలయ తిరగడం పూర్తయ్యాక రామచంద్రం ఇంటి చుట్టూ ఉన్న చెట్ల దగ్గరికి నడిచాడు. నూరు వరహాల చెట్లు, దేవకాంచనం, పారిజాతం, మందార, గులాబీల చెట్లు పుష్పాలతో అలరారుతున్నాయి.

సపోట, జామ, అరటి చెట్లు పళ్ళతో విందుగా కనిపిస్తున్నాయి. వాటిని చూడగానే రామచంద్రం మనసు... ఆనంద సాగరమైంది.

మనిషికి ఉన్నది తృప్తి... పశువుకి తిన్నది తృప్తి అనే సామెత అక్షర సత్యం.

తనింటిని, ఈ మొక్కల్ని, పొలాల్ని చూస్తూంటే చాలు. తన కడుపు నిండిపోతుంది. ఎక్కడికీ వెళ్ళాలనిపించదు.

కాని... ఈమధ్యన కొడుకు అభిరామ్ ఒత్తిడి ఎక్కువైంది. "నాన్నా! కొన్నాళ్ళపాటు నా దగ్గరుండండి! మీక్కూడా రిలీఫ్‌గా ఉంటుంది. ఓసారి మెడికల్ చెకప్ కూడా చేయిస్తాను!" అంటూ ఎప్పటికప్పుడు ఫోన్లు చేస్తున్నాడు.

అభిరామ్ ఆరాటం, ప్రేమాభిమానాలు చూసి ఓసారి హైద్రాబాద్ వెళ్ళి రావాలనిపిస్తోంది.

పారిజాతం పూలు గుట్టలుగా చెట్టు క్రింద రాలడం చూసి వాటిని గుప్పిట్లోకి తీసుకున్నాడు రామచంద్రం.

శ్రీనివాసుని గుడికి పూలివ్వమని మురళి చేత ప్రతి నిత్యం కబుర్లు పెడుతూనే ఉంటాడు పూజారి రమణాచారి.

తను మొండి చేయి చూపించి మురళికి ముచ్చెమటలు పోసేటట్టుగా తిడతాడు. ఒక్కొక్కప్పుడు గేటు దగ్గరే నిలబడి కసురుతాడు.

అయినా తనెందుకు దేవుడికి పూలివ్వాలి.

ఊళ్ళో అందరికీ డబ్బున్నవాడి మీదే కన్నుంటుంది కాబోలు!

దేవుడు పేరు చెప్పి తనింట్లో పూచిన పువ్వులు, కాయలు పండ్లు ఏదో విధంగా కాజేయాలని చూస్తారు.

తను అమాయకుడనుకుంటున్నారు... ఈ వెర్రిబాగుల జనం. ఎవరికీ లొంగడని వీళ్ళకి తెలీదు.

తను కొడుకు దగ్గరికి వెళ్ళినా సన్యాసిగాణ్ణి కాపలా పెట్టి, ఇంటిని, చెట్లని జాగ్రత్తగా చూడమని చెప్పి మరీ ఊరికి వెళతాడు.

కొడుకు తృప్తికోసం ఓ వారంరోజులు హైద్రాబాద్‌లో ఉండి వచ్చేస్తాడు.

తర్వాత మరి హైద్రాబాద్ కొన్నాళ్ళవరకు వెళ్ళఖ్ఖర్లేదు.

"సార్! మీకోసం నారాయణగారొచ్చారు!"

ఎప్పుడక్కడికి వచ్చాడో తెలీదు. సన్యాసి వినయంగా చేతులు కట్టుకొని తనెదురుగా నిలబడ్డాడు.

ప్రతీరోజూ కాఫీ, టిఫిన్, భోజనం హోటల్ నుండి పట్టుకొస్తాడు సన్యాసి.

తనేమిచ్చినా తీసుకుంటాడు. నోటితో అడగడు.

వాడి దృష్టి కిందపడ్డ చిలక్కొట్టుడు జాంపళ్ళు మీదుండడం గమనించాడు రామచంద్రం. వాటిని తీసుకోమని చెప్పి వసారా వైపు వడివడిగా నడిచాడు.

అప్పటికే నారాయణ తీరుబడిగా అక్కడున్న కుర్చీలో కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు. అతణ్ణి చూడగానే రామచంద్రం కళ్ళల్లో కొత్త వెలుగు ప్రసరించింది.

నారాయణ కూడా ఊళ్ళో తనలాగే భూస్వామి. కొడుకులు, కూతుళ్ళు మంచి పొజిషన్లలో ఉన్నారు.

అయినా ఇప్పటికీ వడ్డీ వ్యాపారాలు చేస్తాడు. రైతులకు అప్పులిస్తాడు. ఆ అప్పులు తీర్చకపోతే వాళ్ళకున్న పొలం తనపేర రాయించుకుంటాడు. నారాయణ దగ్గర అప్పంటే ఊళ్ళో అందరికీ భయమే.

నారాయణ వ్యాపారంకోసం ఊళ్ళు తిరుగుతాడు. అరవై దాటినా ఆర్థిక పరిస్థితి బాగున్నా... డబ్బుకోసం అంతలా కష్టపడే మనిషి ఈ ఊళ్ళో మరొకరుండరు. డబ్బంటే అంత పిచ్చి మరి.

ఎప్పుడైనా తీరిక దొరికితే శ్రీనివాసుని గుడికి వెళ్ళినప్పుడు ముష్టివాళ్ళకి పావలా, అర్ధ తను రాలుస్తాడు కాని... నారాయణ వాళ్ళవైపు చూడడు.

డబ్బు లేనివాళ్ళంటే అంత అసహ్యం నారాయణకి.

రామచంద్రం ప్లాస్కులో ఉన్న కాఫీ గ్లాసులో పోసి నారాయణకందిస్తూ హైద్రాబాద్ ప్రయాణం గురించి చెప్పాడు.

వెంటనే నారాయణ ఆశ్చర్యపోతూ "మా రెండోవాడు రమ్మని రోజూ ఫోన్లు చేస్తున్నాడు. అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడుట. నేను కూడా హైద్రాబాద్ వెళ్దామనుకుంటున్నాను. ఎల్లుండే బయలుదేరుదాం.

ఓ పని చేద్దాం. ఇద్దరం బస్సులో వెళ్ళి.. ఓ నాలుగు రోజులుండి వచ్చేద్దాం. ఏమంటావు?" అన్నాడు.

ఆ సలహా నచ్చింది రామచంద్రానికి. నారాయణ పక్కనుంటే కాస్త కాలక్షేపంగా ఉంటుంది. తనక్కూడా హైద్రాబాద్‌లో ఎక్కువ రోజులుండడం ఇష్టంలేదు.

మళ్ళా నారాయణ, తను కలసి ఈ ఊరు వచ్చేయవచ్చు.

వెంటనే రామచంద్రం చిరునవ్వు మిత్రుడికేసి చూస్తూ "నాక్కూడా అక్కడ ఎక్కువరోజులుండడం ఇష్టంలేదు. నీతో వచ్చి మళ్ళా నీతో వచ్చేస్తాను!" అన్నాడు.

"శభాష్!"అంటూ తలూపి నారాయణ లోకాభిరామాయణం మొదలుపెట్టాడు.

సరిగ్గా అప్పుడే శ్రీనివాసుని గుడి పూజారి రమణాచారి... దూరంనుండే రెండు చేతులు జోడిస్తూ... వస్తూ కనిపించాడు రామచంద్రానికి. ఆ దృశ్యం నారాయణ కంట పడింది.

"పూజలు చేస్తాం. అభిషేకాలు చేస్తాం అంటూ ముసలోడు డబ్బుకోసం వస్తున్నాడు కాబోలు!"అంటూ గొణిగాడు... విసుగ్గా మొహం పెట్టి.

డబ్బు ప్రస్తావన తేగానే రామచంద్రం మొహం ముడుచుకుపోయింది. రోజూ వినయ్‌ని, మురళిని పంపిస్తున్నాడు. చాలదూ! మళ్ళా స్వయంగా వచ్చి ఏ నీతులు బోధిస్తాడో మహానుభావుడు. చిరాగ్గా మొహం పెట్టాడు.

రమణాచారి వసారాలోకి అడుగుపెట్టి మిత్రులిద్దరి మొహాల్లో భావాలు గమనించి గొంతు విప్పాడు.

"రామచంద్రంగారూ! రేపట్నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. గుళ్ళో దేవుడికి పువ్వులు దొరకడంలేదు. నిండు మనసుతో మీరు పూలిస్తే దేవుడు కళకళలాడుతూ కనిపిస్తాడు! చంద్రుడికో నూలు పోగులా ఈ సాయం మీరుచేయాలి. దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు!"

'రక్షించాడు! డబ్బు ప్రసక్తితేలేదు.' నారాయణ మళ్ళా సణగడం రామచంద్రం చెవుల్లో పడింది.

నిజమే! పూజారిగారు పైసా అడగలేదు. పెరట్లో పూచిన పువ్వులు ఓ నాలుగు రోజులు పంపిస్తే చాలు. తనెలాగూ ఊళ్ళో ఉండడు.

ఆ ఆలోచన స్ఫురించగానే రమణాచారి వైపు తిరిగి గట్టిగా నవ్వాడు రామచంద్రం. "తప్పకుండా ఆచారి గారూ. రేపు నేనే వచ్చి పువ్వులు పట్టుకొస్తాను. ఈ మాత్రం దానికి ఇంత దూరం రావాలా?"

రమణాచారి వదనం వికసించింది. "వినయ్, మురళి వచ్చినప్పుడల్లా మీరు చికాకు పడుతున్నారుట. వాళ్ళు ఈ కాలం కుర్రాళ్ళు. మాటతీరు తెలీదు. పెద్దవాళ్ళు ఏమనుకోకండి!"అన్నాడు కాస్త నొచ్చుకొంటూ.

రామచంద్రం లేదన్నట్టుగా తలాడించాడు.

రమణాచారి మరోసారి చేతులు జోడించి... వెనక్కి తిరిగాడు.

రామచంద్రానికి ఒక విషయం ఆశ్చర్యం కలిగించింది. అతడు కనీసం నారాయణవైపు చూళ్ళేదు. ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

అంతే నారాయణ మనస్తత్వం రమణాచారికి ఏనాడో తెలుసన్నమాట.

ఏమో! అవన్నీ తనకనవసరం. తన వంతు దేవుడికి పూలివ్వడమే. రేపు ఆ కార్యక్రమం పూర్తిచేసి... ఎల్లుండి హైద్రాబాద్ వెళ్ళాలి.



గుళ్ళో అడుగుపెట్టగానే శ్రీనివాసుని విగ్రహానికి వినమ్రతగా నమస్కరించాడు రామచంద్రం. అదేం విచిత్రమో తెలీదు. ఆ విగ్రహం ప్రభావమో అర్థంకాదు. ఈ సమాజంలో బ్రతకడానికి డబ్బే ముఖ్యమని ఎందరితో ప్రగల్భాలు పలికినా దేవుణ్ణి చూసేసరికి... తనెంత అల్పుడో అర్థమవుతోంది.

తను ఊళ్ళో లేనప్పుడు మొక్కలు, చెట్లు సంరక్షణ సన్యాసిగాణ్ణి చూడమని చెప్పాలి. ఏవిటో! ఎక్కడికి వెళ్ళినా మనసంతా ఇంటి మీదే ఉంటుంది.

"రామచంద్రం! ఎల్లుండే మన ప్రయాణం. ఈలోగా నీ పన్లు చక్కపెట్టుకో. వస్తాను!" అంటూ నారాయణ అక్కడనుండి లేచాడు.

రామచంద్రం తలూపి... అతడు వెళ్ళిన వైపు చూస్తుండిపోయాడు.

అతడికింకా ఆశ్చర్యంగానే అనిపిస్తోంది. రమణాచారి కనీసం నారాయణ వైపు కన్నెత్తి చూడకపోవడం.

సన్యాసి అందించిన టిఫిన్ అందుకొంటూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

* * *

తెలతెలవారుతోంది. గుడి గంటలు గణగణమని మోగుతున్నాయి. చలిగాలి శరీరాల్ని వొణికిస్తోంది.

పూల బుట్ట చేత్తో పట్టుకొని గుడి మెట్లెక్కుతున్నాడు రామచంద్రం. అసలు సన్యాసి చేత దేవుడికి పూలు పంపిద్దామనుకున్నాడు.

కాని... తను శ్రీనివాసుని గుడి చూసి చాలారోజులైంది. ఈమధ్యన ఓ మహానుభావుడు పాతిక వేలు విరాళమిచ్చి గుడి మొత్తం బాగుచేయించాట్ట.

అందుకే గుడిని చూడాలని బయలుదేరాడు.

ఇన్నాళ్ళు వ్యాపారం గురించి ఆలోచించడంతోనే సరిపోయింది. ఎలాగు రేపు ఊరికి వెళుతున్నాడు కాబట్టి ఓసారి దైవదర్శనం చేసుకోవాలనిపించింది.

రామచంద్రం మెట్లెక్కుతూంటే "బాబూ!"అన్న పిలుపు వినిపించింది. ఎవరు చెప్మా అనుకొంటూ వెనక్కి తిరిగాడు రామచంద్రం.

తనకి భోజనం కేరేజీలు పంపించే మంగమ్మ ఆయాస పడుతూ మెట్లెక్కుతోంది. పలకరింపుగా నవ్వాడు రామచంద్రం.

"భోజనం బాగుంటోందా!" ప్రేమ పెల్లుబికింది మంగమ్మ గొంతులో. ఆ అభిమానానికి రామచంద్రం పొంగిపోయాడు. అతని దృష్టి ఆమె చేతిలో ఉన్న నందివర్ధనం పూల దండల మీద పడింది.

"ఇంత కష్టపడి ఆ పూలు దేవుడికివ్వడమెందుకు? అసలే ముసిల్దానివి. నలుగురికి కేరేజీలు కడుతూ ఇప్పటికే కష్టపడుతున్నావు. ఎందుకీ తాపత్రయం?" ఉండబట్టలేక అన్నాడు.

బోసిగా నవ్వింది మంగమ్మ. "తాపత్రయం లేకపోతే బ్రతుకే లేదు బాబూ! ఈ పూలన్నీ మా పెరట్లో పూచినవే. అవన్నీ ఏరి దండలుకట్టి దేవుడికి రోజూ ఇస్తాను. నాబోటిదాన్ని దేవుడికంతకన్నా ఏటిస్తాను? మనకు తోచినంత సాయంచేస్తే... దేవుడు చల్లగా చూస్తాడు!"

మంగమ్మ పిచ్చి నమ్మకం చూపి... తెరలు తెరలుగా నవ్వొచ్చింది రామచంద్రానికి. ఈ కాలంలో డబ్బుంటే చాలు. ఏ దేవుడు చూడఖ్ఖర్లేదనుకుంటూ మెట్లెక్కసాగాడు.

గుళ్ళో అడుగుపెట్టగానే శ్రీనివాసుని విగ్రహానికి వినమ్రతగా నమస్కరించాడు రామచంద్రం. అదేం విచిత్రమో తెలీదు. ఆ విగ్రహం ప్రభావమో అర్థంకాదు. ఈ సమాజంలో బ్రతకడానికి డబ్బే ముఖ్యమని ఎందరితో ప్రగల్భాలు పలికినా దేవుణ్ణి చూసేసరికి...తనెంత అల్పుడో అర్థమవుతోంది. (మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

ఆ రూపం అనంతంగా... అవ్యక్తంగా... అద్వితీయంగా సాక్షాత్కరిస్తూ... తనని మరో లోకంలోకి తీసుకువెళుతుంది.

రమణాచారి చేతుల్లో పూల బుట్ట ఉంచాడు రామచంద్రం. తర్వాత పళ్ళెంలో రూపాయి వేస్తూ... ''నేను నాలుగు రోజులు హైద్రాబాద్ వెళుతున్నాను. సన్యాసి ఈ నాలుగు రోజులు పూలు తెచ్చిస్తాడు'' అన్నాడు హారతి కళ్ళకద్దుకొంటూ.

అప్పుడే అక్కడికి వచ్చిన మంగమ్మ ఆ మాటలు వింది.

''ఆ సన్యాసిగాడొట్టి తాగుబోతు మనిషి బాబూ! స్థిరం లేదు. నేను రోజూ మీ పెరట్లోకొచ్చి పూలుకోసి దేవుడికిస్తాను. మీ పళ్ళ మొక్కల మీద చేయి వేయను. నిబ్బరంగుండండి''అంది భరోసా ఇచ్చినట్లుగా.

రాబోతున్న నవ్వునాపుకొంటూ రామచంద్రం తలూపాడు. మంగమ్మ మాటలు నిజమే! ఎవరి దగ్గరనుండి ఏది ఆశించదు.

మంగమ్మ తెచ్చిన పూల దండలందుకున్నాడు రమణాచారి. దేవుని మెడలో అలంకరించాడు. మంగమ్మ వైపు తిరిగి ''ఈ వయసులో ఇంత కష్టపడి పూలు తెస్తున్నావు. నీ మేలు మర్చిపోలేం!''అన్నాడు కృతజ్ఞత నిండిన కళ్ళతో.

తల అడ్డంగా ఊపింది మంగమ్మ. ''నాదేవుంది బాబూ! నేల తల్లి చెట్లకి ప్రాణం పోస్తోంది. చెట్లు విరగబడి పూస్తున్నాయి. దేవుడికోసం ఈ మాత్రం శ్రమపడలేనా!''

ఆ మాటలు విన్న రామచంద్రం ఉలిక్కిపడ్డాడు. మంగమ్మలో ప్రస్ఫుటిస్తున్న విశాల దృక్పథం తనలో ఎందుకు లేదు? మంగమ్మ ఏనాడు తన సుఖం గురించి ఆలోచించలేదు. అంతస్థులు... డబ్బు లేకపోయినా... కొండంత ఔదార్యం ఆ కళ్ళల్లో ప్రతిఫలిస్తూంటుంది. నేడో... రేపో... ఈ లోకాన్ని విడిచిపెడతాననే వైరాగ్యంవల్ల కాబోలు! పుణ్యం మూటకట్టుకుంటోంది.

రామచంద్రంలో... ఇలా ఎన్నో ఆలోచన్లు... పరిభ్రమించసాగాయి. మరోసారి దేవుడికి చేతులు జోడించి వెనక్కి తిరిగాడు.

* * *

ఘాట్ రోడ్డుమీద బస్సు పరుగులు పెడుతోంది. చుట్టూ చీకటి, ప్రయాణీకులు నిద్ర మత్తులో ఊగిపోతున్నారు. రామచంద్రం మాత్రం మేల్కొని చుట్టూ చూడసాగాడు.

నారాయణ తోడుంటాడని బస్సులో ప్రయాణానికి సిద్ధమయ్యాడు తప్ప అర్ధరాత్రిళ్ళు బస్సులో ప్రయాణించడం ఏంతమాత్రం ఇష్టంలేదు. కాళ్ళు చాపుకొని పడుకోవడానికి వీలుండదు బస్సులో.

అందరూ ఎలా నిద్రపోతున్నారో అర్థంకాలేదు.

హఠాత్తుగా రామచంద్రం దృష్టి నారాయణ మీద పడింది. హాయిగా చీకు చింత లేకుండా గురకలు తీస్తున్నాడు.

డబ్బున్నవాడికి నిద్రపట్టదంటారు. నారాయణ ఎవరి గురించి ఆలోచించడు. ఎంతసేపు తన వ్యాపారం, తన సుఖం గురించి తాపత్రయపడతాడు.

తనకే డబ్బుంది. అయినా రాత్రుళ్ళు నిద్రపట్టదు. తన కళ్ళముందే వృద్ధులు, యువకులు ఊరి గురించి తాపత్రయపడుతూంటే తనలో ఏదో సంచలనం... ఏదో పరివర్తన.

డబ్బు లేని మంగమ్మలాంటి వాళ్ళు కూడా ఎదుటి వాళ్ళకోసం ఆరాటపడటం గమనించాక తనెంత అల్పుడో తెలుస్తోంది. ఇన్నాళ్ళకి... తనలో ఈ మార్పే విటో!

బస్సు ఇటూ అటూ ఊగుతూంటే ఉలిక్కిపడి డ్రైవర్ వైపు దృష్టి నిల్పాడు రామచంద్రం. పూటుగా తాగి ఊగుతూ...జోగుతూ బస్సు నడుపుతున్నాడు డ్రైవర్. అంతే! రామచంద్రం గుండె గుభేల్‌మంది.

''డ్రైవర్ డ్రైవర్...!''అంటూ అరుస్తూ సీట్లోంచి లేచి డోర్‌వరకు వచ్చాడు రామచంద్రం. మత్తులో మునిగిన డ్రైవర్‌కి ఒంటిమీద స్పృహ లేదు.

డబ్బున్నవాడికి నిద్రపట్టదంటారు. నారాయణ ఎవరి గురించి ఆలోచించడు. ఎంతసేపు తన వ్యాపారం, తన సుఖం గురించి తాపత్రయపడతాడు.
తనకే డబ్బుంది. అయినా రాత్రుళ్ళు నిద్రపట్టదు. తన కళ్ళముందే వృద్ధులు, యువకులు ఊరి గురించి తాపత్రయపడుతూంటే తనలో ఏదో సంచలనం... ఏదో పరివర్తన.
డబ్బు లేని మంగమ్మలాంటి వాళ్ళు కూడా ఎదుటి వాళ్ళకోసం ఆరాటపడటం గమనించాక తనెంత అల్పుడో తెలుస్తోంది. ఇన్నాళ్ళకి... తనలో ఈ మార్పే విటో!

అంతే! అప్పటికే బస్సు అదుపుతప్పింది. రోడ్డుపక్కనున్న అగాధంలోకి జారిపోయింది.

* * *

''తెలివొచ్చింది! తెలివొచ్చింది!''

ఎవరో అరుస్తున్నారు. బయట బూట్ల చప్పుళ్ళు హడావుడి.

రామచంద్రానికి ఒళ్ళంతా నొప్పులుగా అనిపించసాగింది. అయినా బలవంతంగా కళ్ళు తెరిచాడు. అందర్నీ చూడగాలనే ఆరాటంవల్ల మసగ్గా కనిపిస్తున్నాయి ఆకారాలు. తనెక్కడున్నాడో తెలీదు. చుట్టూ... ఎవరున్నారో... ఏం జరుగుతోందో తెలీని పరిస్థితి. తనలాగే బస్సులో అందరూ బ్రతికారో! లేదో? అసలెందుకిలా జరిగింది?

''నాన్నగారూ! నాన్నగారూ!'' కొడుకు గొంతు వినిపిస్తూంటే లేని శక్తి తెచ్చుకొని కళ్ళు వెడల్పుచేసాడు రామచంద్రం.

ఎదురుగా అభిరామ్ కనిపిస్తున్నాడు. కొడుకుని చూడగానే రామచంద్రానికి దుఃఖం ఆగలేదు.

''బాబూ!'' అంటూ అభిమానంగా కొడుకు చేతినందుకున్నాడు.

''నాన్నా! మీకు ప్రాణాపాయం తప్పింది. ధైర్యంగా ఉండండి!'' భరోసా ఇస్తూ తండ్రి పక్కనే కూర్చున్నాడు అభిరామ్.

రామచంద్రం తనకెదురుగా మురళి, వినయ్‌లు కూర్చోవడం చూసాడు. ఆ పక్కనే... పూజారి రమణాచారి. కొంచెం దూరంలో తలుపుదగ్గర కూర్చుంది మంగమ్మ.

అప్పటికే రామచంద్రంలో ఎన్నో అనుమానాలు. ''బస్సులో అందరూ బ్రతికారా!'' మెల్లగా అన్నాడు.

అభిరామ్ తల వొంచుకున్నాడు. ''బస్సులో సగం మంది పోయారు. వాళ్ళల్లో నారాయణగారు కూడా ఉన్నారు'' అన్నాడు బాధగా.

నిశ్చేష్టుడయ్యాడు రామచంద్రం. అప్పటికర్థమైంది. తన ఒంటినిండా కట్లున్న సంగతి. మళ్ళా అభిరామ్ తండ్రి వైపు చూస్తూ ''ప్రమాద వార్త తెలియగానే మురళి, వినయ్‌లు అంబులెన్స్ తెచ్చి మిమ్మల్ని మంచి హాస్పిటల్లో జాయిన్ చేశారు. మీ గ్రూపు రక్తం ఎక్కడా దొరకలేదు. మంగమ్మ రక్తం ఇవ్వడంవల్ల మీకు ప్రాణాపాయం తప్పింది!'' అన్నాడు చెమర్చిన కళ్ళని తుడుచుకొంటూ.

రామచంద్రం గొంతు బాధతో పూడుకుపోయింది. తనుకూడా నారాయణలాంటి వాడే. ఎందుకు బ్రతకడం? మంగమ్మకి తనకి ఏం సంబంధం ఉందని ఆ వయసులో కూడా రక్తం ఇచ్చింది!

రామచంద్రం మురళి, వినయ్‌ల వైపు చేయి చాపాడు. వాళ్ళిద్దరూ అతని దగ్గరగా వచ్చి కూర్చున్నారు. ''రోజూ మిమ్మల్ని కసురుతున్నారు. కక్ష తీర్చుకోకుండా కాపాడారెందుకు?'' ఆవేదనగా అన్నాడు.

సమాధానం రమణాచారి నుండి వచ్చింది.

''మీ మీద ఎవరు కక్ష తీర్చుకొంటారు?. అది వాళ్ళ విధి. మీ అబ్బాయి అభిరామ్ వినయ్ ఇంజనీరింగ్ చదువుకి ఫీజులు కడుతున్నాడు. మురళిని యమ్మెస్సీ చదివిస్తున్నాడు. గుడికి పాతిక వేలిచ్చిన మంచి మనిషి మీ అభిరామ్.

'మా నాన్న ఒంటరిగా ఉన్నాడు. అతను మంచిచెడ్డా తెలుసుకుంటే చాలు నాకు' అంటూ అభిరామ్ వాళ్ళని కోరాడు. అందుకే వాళ్ళు పువ్వుల పేరుతో మీదగ్గరకొచ్చేవారు.

మీరు కృతజ్ఞత చెప్పవలసినది మాకు కాదు మంగమ్మకి. డాక్టర్లు వొద్దని చెప్పినా వినకుండా మీకు రక్తమిచ్చింది! అన్నాడు రమణాచారి.

తనకన్నా సంస్కారంలోను, మానవత్వంలోను ఎదిగిపోయిన కొడుకు వైపు విశ్రాంతిగా చూస్తూ, వెంటనే మంగమ్మ వైపు కృతజ్ఞతగా చూసాడు రామచంద్రం.

తనలో మార్పుకోసమే... భగవంతుడు మళ్ళా తనకి ప్రాణం పోసాడు కాబోలు!

''మంగమ్మా! ఈరోజునుండి నా ఇంట్లోనే ఉండు'' సన్యాసిగాడు నీకు సాయంగా ఉంటాడు. మనిద్దరికీ వండి పెడతాడు. పెరట్లో పూచిన పువ్వులు, పళ్ళు దేవుడికిచ్చుకో. ప్రశాంతంగా నా ఇంట్లో ఉండు. నాకదే పదివేలు. కాదనకు!''అన్నాడు రామచంద్రం.

అతనిలో మార్పు గమనించి... అక్కడున్న వాళ్ళందరి మొహాలు వికసించాయి. మంగమ్మ సరేనంటూ బోసిగా నవ్వింది. ఆ నవ్వు విప్పారిన నందివర్ధనం పువ్వులా స్వచ్ఛంగా... నిండుగా ఉంది.

★